04-04-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - దేహ సహితముగా దేహం యొక్క అన్ని సంబంధాలలో ట్రస్టీగా అవ్వండి, అందరినీ సంభాళిస్తూ ఎవరిపైనా మమకారం పెట్టుకోకండి"

ప్రశ్న:- ఈ డ్రామాలో మాయ ఏ పొరపాట్లు చేయించినప్పుడు తండ్రి పొరపాట్లు చేయనివారిగా తయారుచేసేందుకు వస్తారు?

జవాబు:- మొదటి పొరపాటు, బ్రహ్మతత్వమునే పరమాత్మగా భావించారు. తత్వముతో యోగము జోడించడమైతే మిథ్య, దీని ద్వారా వికర్మలు వినాశనమవ్వవు. 2. హిందుస్థాన్ లో ఉంటున్న కారణముగా దేవీ-దేవతా ధర్మానికి బదులుగా స్వయానిది హిందూ ధర్మము అని చెప్పుకోవడము - ఇది కూడా పెద్ద పొరపాటు. ఈ పొరపాటు కారణముగా ధర్మములో శక్తి లేదు. ఇప్పుడు తండ్రి మిమ్మల్ని పొరపాట్లు చేయనివారిగా తయారుచేసేందుకు వచ్చారు.

పాట:- నా మనసు అనే ద్వారము వద్దకు ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కె ద్వారే...)

ఓంశాంతి. పిల్లల వద్దకు ఎవరు వచ్చారు? పిల్లల వద్దకు తల్లిదండ్రులే వస్తారు. నీవే తల్లివి, తండ్రివి, మేము మీ పిల్లలము అని వారి కోసమే గాయనము ఉంది. ఇప్పుడు మీరు పిల్లల స్థానములో కూర్చున్నారు కదా. నేను నిరాకారుడిని అని పరమపిత పరమాత్మ కూర్చుని పిల్లలకు అర్థం చేయిస్తారు. బ్రహ్మ, విష్ణు, శంకరులు కూడా ఈ విధంగా అనలేరు. నిరాకార పరమపిత పరమాత్మయే ఈ శరీరం ద్వారా ఇలా చెప్పగలరు. నాకు స్థూల శరీరం లేక సూక్ష్మ శరీరము ఏదీ లేదని మీకు తెలుసు. ఇలా ఆత్మయే శరీరము ద్వారా మాట్లాడుతుంది. నిరాకార పరమపిత పరమాత్మ కూర్చుని పిల్లలను చదివిస్తున్నారు. కొత్తవారు ఎవరైనా వింటే, ఇది ఎలా జరగగలదు అని అంటారు. అవును, శివ భగవానువాచ - బ్రహ్మ శరీరము ద్వారా. శివబాబాకు తమ శరీరమైతే లేదు. మరి ఇంతమంది బి.కె.లు ఎక్కడి నుండి వచ్చారు? ఆ బ్రాహ్మణులు ఎవ్వరూ తమను తాము బ్రహ్మకుమారులుగా పిలిపించుకోరు. మేము బి.కె.లము అని మీరు ఎందుకు అంటున్నారు? ఈ బ్రహ్మకు తండ్రి పరమపిత పరమాత్మ శివ అని మీరు నిరూపించి చెప్పగలరు. వారికి ఈ బ్రహ్మ, విష్ణు, శంకరులు ముగ్గురు పిల్లలు. కావున శివబాబా ఈ బ్రహ్మ ముఖము ద్వారా ముఖ వంశావళిని రచించి వారిని మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు. ఈ ప్రపంచములో మనుష్యులైతే చాలామంది ఉన్నారు. అనేక రకాల భిన్న-భిన్న ధర్మాలు, జాతులు ఉన్నాయి. గుజరాతీ, పంజాబీ, యు.పి, క్రిస్టియన్, బౌద్ధులు, మహారాష్ట్రీయులు మొదలైన ఎన్నో జాతుల పేర్లు ఉన్నాయి. సత్యయుగములో ఇన్ని ధర్మాలు, జాతులు ఉండనే ఉండవు. అనేక భాషలు ఉండవు, అనేక ధర్మాలు ఉండవు. ఒకే రాజ్యం ఉండాలి అని అంటారు కూడా. సత్యయుగములో ఉన్నదే దేవీ-దేవతా ధర్మము. తండ్రి అంటారు, నేను వచ్చి ఒక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తాను. మనుష్యుల నుండి దేవతలుగా మార్చడానికి భగవంతుడికి ఒక్క క్షణము పట్టదు అని అంటారు కూడా. దేవతలైతే సత్యయుగంలో ఉంటారు, త్రేతాలో కూడా ఉండరు. త్రేతాలో క్షత్రియ వర్ణము ఉంటుంది. బ్రహ్మ నోటి నుండి బ్రాహ్మణులు వెలువడినట్లుగా శాస్త్రాలలో కూడా రాయబడి ఉంది. మరియు బ్రాహ్మణులను చదివించి మళ్ళీ దేవత మరియు క్షత్రియ ధర్మాన్ని స్థాపన చేస్తారు. మిగిలిన అనేక ధర్మాలు ఏవైతే ఉన్నాయో, అన్నింటి వినాశనము జరగనున్నది. తండ్రి అర్థం చేయిస్తారు, మధురమైన పిల్లలూ - నేను ఆత్మలైన మీకు సత్యాతి-సత్యమైన తండ్రిని, నేను ఎప్పుడూ మారను, నన్ను సదా తండ్రి స్థానములో స్మృతి చేస్తారు. భక్తులు భగవంతుడిని స్మృతి చేస్తారు ఎందుకంటే ఈ శిక్షణను భగవంతుడు తప్ప ఇంకెవ్వరూ ఇవ్వలేరు. ఇప్పుడైతే అనేక ధర్మాలు ఉన్నాయి. మీరు లిస్టు తయారుచేయలేరు. ఎంతమంది మనుష్యులు ఉన్నారు, తండ్రి వచ్చి మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు. అది కూడా అందరినైతే తయారుచేయరు. ఇవి అర్థం చేసుకోవాల్సిన విషయాలు. తండ్రి అంటారు, నేను తప్ప ఎవ్వరూ ఈ వివరణను ఇవ్వలేరు. తండ్రి కూర్చొని పిల్లలైన మిమ్మల్ని సత్యయుగం కోసం చదివిస్తారు. వారంటారు, పిల్లలూ, ఇప్పుడు ఎంతగా పురుషార్థము చేసి స్వర్గములో ఉన్నత పదవిని పొందాలనుకుంటే అంతగా పొందండి. మనుష్యులు ప్రతి ఒక్కరు తమ జీవనోపాధి కోసం ఎంతగా పురుషార్థం చేస్తారు! ఎవరైనా సరే, బాగా చదువుకుంటే ఉన్నత పదవిని పొందగలరు. ఇక్కడ కూడా తండ్రి అంటారు, అబలలకు, వేశ్యలకు కూడా పురుషార్థముతో విశ్వం యొక్క సూర్యవంశీ రాజ్యము లభించగలదు.

బాబా అర్థం చేయించారు, ఈ సమయంలో ప్రతి ఒక్క ద్రౌపది, బాబా రక్షించండి, అని పిలుస్తుంది, మళ్ళీ - శ్రీకృష్ణుడు పైన కూర్చున్నారు, చీరలు ద్రౌపదికి లభిస్తూ ఉంటాయి, రక్షణ జరుగుతుంది అని చూపిస్తారు. ఇప్పుడు ఇటువంటి విషయాలైతే లేవు. ఇవి ఈ సమయానికి చెందిన విషయాలు. తండ్రి అంటారు, మిమ్మల్ని 21 జన్మలు వివస్త్రగా అవ్వడము నుండి రక్షిస్తాను. మీ వస్త్రాలను ఎవ్వరూ తొలగించలేరు. ఇది ప్రవృత్తి మార్గము, ఇరువురూ పవిత్రంగా అవ్వాలి. అర్ధకల్పం నుండి వికారాలకు అలవాటు పడిపోయి ఉన్నారు, కావున ఈ అలవాటు తొలగిపోవడం లేదు. తండ్రి వచ్చి మిమ్మల్ని వివస్త్రగా అవ్వడము నుండి రక్షిస్తారు, ఇందులో చాలా శ్రమ అనిపిస్తుంది. పవిత్రతలో ఉంటారు, మళ్ళీ మాయ దాడి చేస్తుంది. అబలలపైన అయితే విషం కారణముగా చాలా అత్యాచారాలు జరుగుతాయి మరియు పిల్లలపై మోహము కూడా ఉంటుంది, ఇందులోనైతే పూర్తి నష్టోమోహులుగా అవ్వాలి. మొట్టమొదట భట్టీ జరిగినప్పుడు చాలామంది ధైర్యము పెట్టి పారిపోయి వచ్చారు. దెబ్బలు తగులుతాయి, హంగామాలు చేస్తారు అని గమనించి వెంటనే త్యాగం చేసేసారు. సన్యాసులు కూడా పారిపోతారు. మొదట అయితే వారికి స్మృతులు బాధిస్తాయి. నష్టోమోహులుగా అవ్వడంలో శ్రమ అనిపిస్తుంది ఎందుకంటే వారి వద్ద ప్రాప్తి యొక్క లక్ష్యము-ఉద్దేశ్యము ఏదీ లేదు. ఏ శక్తి లభించదు. మీకైతే శక్తి లభిస్తుంది. వారికి పవిత్రతా శక్తి ఎక్కడి నుండి లభిస్తుంది? పవిత్రతా సాగరుడైతే పరమపిత పరమాత్మ ఒక్కరే, వారి నుండే వారసత్వం లభిస్తుంది. వారు తండ్రితో యోగం జోడించరు. బ్రహ్మముతో యోగము జోడిస్తారు, కావున పూర్తి పవిత్రముగా అవ్వలేరు. బ్రహ్మము లేక తత్వముతో యోగము జోడించడము మిథ్య అవుతుంది. చూడండి, ఈ పాయింట్లు మంచి రీతిలో ధారణ చేయాలి. పొరపాట్లు అయితే చాలా చేసారు. హిందుస్థాన్ లో ఉండేవారిది హిందూ ధర్మము అని అంటారు. ఇది కూడా పొరపాటు. బ్రహ్మమును లేక తత్వమును పరమాత్మ అని అనడము, ఇది కూడా పొరపాటు. డ్రామాలో కూడా రచించబడి ఉంది. తండ్రి వచ్చి ఈ-ఈ పొరపాట్లను మాయ చేయిస్తుందని అర్థం చేయిస్తారు. బాబా వచ్చి మళ్ళీ పొరపాట్లు చేయనివారిగా చేస్తారు. సత్యయుగములో ఒకే ధర్మము, ఒకే భాష ఉండేది. బృందావనములో ఉండేవారిని బృందావనులు అని అంటారని కాదు. అక్కడ ధర్మము ఒకటే ఉంటుంది. తండ్రి అంటారు, నేను వస్తాను, మిమ్మల్ని మళ్ళీ దేవతలుగా తయారుచేస్తాను. మీరు స్వర్గానికి యజమానులుగా అవుతారు. తండ్రి స్వర్గాన్నే రచిస్తారు, మరి మనం నరకానికి యజమానులుగా ఎందుకు ఉన్నాము! కొత్త ప్రపంచంలో తప్పకుండా మనం స్వర్గానికి యజమానులుగా ఉంటాము. ఆ సమయంలో మిగిలిన ఆత్మలందరూ పరంధామంలో ఉంటారు. ఈ విషయాలు ఇప్పుడు మీ బుద్ధిలో ఉన్నాయి. ఎంతెంతగా యోగము ఉంటుందో, అంతగా ధారణ బాగా జరుగుతుంది. ఎక్కడా కూడా మమకారం ఉండకూడదు. స్వయాన్ని ట్రస్టీగా భావిస్తూ పాలన చేయండి. ఇది తండ్రి యొక్క తాకట్టు. దేహ సహితముగా దేహం యొక్క అన్ని సంబంధాలకు మనం ట్రస్టీలము. పరీక్షలు కూడా వస్తాయి. ఏదైనా వ్యాధి వచ్చింది, దుఃఖం కలిగింది అంటే సంభాళించుకోవాల్సి ఉంటుంది. ఇది ఉన్నదే దుఃఖపు ప్రపంచము. శివబాబాకైతే ఏ దుఃఖము ఉండదు. వారు ట్రస్టీ. ఎవరికైనా ఏదైనా జరిగితే అంటారు, వారు తమ లెక్కాచారాలను తీర్చుకొని వెళ్ళి ఇంకొక శరీరాన్ని తీసుకున్నారు, ఇందులో మనదేమి పోతుంది. ఇంతమంది మనుష్యులందరూ శరీరాలను విడిచిపెడతారు, శివబాబాకు దుఃఖము ఏమైనా కలుగుతుందా! ఇంకా సంతోషం కలుగుతుంది. ఈ పాత, ఛీ-ఛీ శరీరాలను వదిలింపజేసి పిల్లలను తిరిగి తీసుకొని వెళ్తాను. దుఃఖము యొక్క విషయము లేనే లేదు. చింతించే విషయమేమీ లేదు. మనము లేస్తూ-కూర్చుంటూ మధురాతి-మధురమైన తండ్రిని స్మృతి చేస్తాము. పరంధామంలోకి వెళ్ళడము కోసం మనం ఏర్పాట్లు చేస్తున్నాము. బాబాను స్మృతి చేస్తూ-చేస్తూ శరీరము వదిలిపోతుంది. ఇలా చాలామంది సన్యాసులకు జరుగుతుంది. కూర్చుంటూ-కూర్చుంటూ ఇక మేము బ్రహ్మములోకి వెళ్ళిపోతాము, వెళ్ళి లీనమైపోతాము అని స్వయము భావిస్తారు. ఈ విధంగా కూర్చుంటూ-కూర్చుంటూ శరీరాన్ని వదిలేస్తారు. బాబా తమ అనుభవంతో చెప్తున్నారు. ప్రాణాయామం చేస్తూ-చేస్తూ మాయమైపోతారు. అలాగని, ఆ ఆత్మ బ్రహ్మములోకి వెళ్తుందని కాదు. ఆత్మ అయితే ఒక శరీరాన్ని వదిలి వెంటనే మరొకదానిని తీసుకుంటుంది. అంతేకానీ, ఎవ్వరూ నిర్వాణములోకి వెళ్ళరు, జ్యోతి జ్యోతిలోనూ ఇమిడిపోదు. అందరూ తప్పకుండా పాత్రను అభినయించాలి.

తండ్రి అంటారు, ఎప్పుడైతే పాత్రధారులందరూ హాజరై ఉంటారో, అప్పుడే నేను వస్తాను ఎందుకంటే నేను ప్రేయసులందరికీ ప్రియుడిని. నా వెనుక ప్రేయసులందరూ తిరిగి వచ్చేస్తారు. నేను అందరినీ తిరిగి తీసుకొని వెళ్ళేందుకు వచ్చాను. ఇప్పుడు నాటకం పూర్తవుతుంది. ఇప్పుడు ఎవరు ఎంతగా పురుషార్థం చేస్తే అంత. సద్గతి దాత తండ్రి ఒక్కరే. ఇప్పుడు తండ్రి వచ్చారు, నేను ఎప్పుడు వస్తాను మరియు ఎలా వస్తాను అన్నది అర్థం చేయిస్తున్నారు. ఆ తర్వాత ఆత్మలైన మిమ్మల్నందరినీ తీసుకొని వెళ్తాను. ఛీ-ఛీ నుండి పుష్పాలుగా తయారుచేస్తాను. పుష్పాలే బలిహారమవుతాయి. శ్రీకృష్ణుడు ఎత్తుకుపోయారని చూపిస్తారు. కానీ దేని కోసం ఎత్తుకొనిపోయారు? శ్రీకృష్ణుని

విషయం కాదు. బాబా విడిపించారు. సహజ రాజయోగం నేర్పించి స్వర్గం యొక్క మహరాజా, మహారాణిగా తయారుచేసేందుకు. మీకు భవిష్యత్తులో రాకుమారులు, రాకుమారీలుగా అయ్యే సాక్షాత్కారము కూడా జరిగింది. తప్పకుండా మనం నెమలి పించం ధారులైన రాకుమారులు, రాకుమారీలుగా అవుతామని మీకు తెలుసు. ఇప్పుడు మీరు బ్రాహ్మణులుగా ఉన్నారు. ప్రజాపిత బ్రహ్మ అని అంటూ ఉంటారు. కావున వారి పిల్లలుగా బ్రహ్మకుమారులు, కుమారీలుగా అవుతారు. ఈ విషయాలు అర్థం చేసుకోవలసినవి మరియు అర్థం చేయించవలసినవి. రాజధాని స్థాపన జరుగుతుంది. కావున అందరూ మంచి రీతిలో పురుషార్థం చేయాలి. ఏ కష్టము ఇవ్వరు, కేవలం అంటారు, ఓ ఆత్మా, తండ్రినైన నన్ను స్మృతి చేయండి మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి. విశ్వానికి యజమానులుగా అవ్వడం కోసం ఈ మాత్రమైతే స్మృతి చేస్తారు. దేహీ-అభిమానులుగా అవ్వండి. దేహాభిమానములోకి రావడంతోనే మాయ దెబ్బ వేస్తుంది. ఒక నాటకము కూడా తయారుచేయబడి ఉంది - మాయ ఇలా చేస్తుంది, భగవంతుడు ఇలా చేస్తారు అని. కావున ఎంతమంది తండ్రికి చెందినవారిగా అయి మళ్ళీ ముఖాన్ని తిప్పేసుకుంటారో ప్రాక్టికల్ గా చూస్తారు! వెళ్ళి నిందిస్తారు. ఆశ్చర్యవంతులై వింటారు, కథాగానం చేస్తారు, పారిపోతారు. సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు, సద్గురువు యొక్క నిందను చేస్తారు. వారిని చూసి మనుష్యులు అంటారు, ఈశ్వరునికి ఎలా విడాకులు ఇచ్చి ఉంటారు. కావున ఇటువంటి నిందకులు ఉన్నతోన్నత స్థానాన్ని పొందలేరు. ఇది ఇప్పటి విషయము.

చాలామంది పిల్లలకు నష్టోమోహులుగా అవ్వడములో చాలా శ్రమ అనిపిస్తుంది. చాలామంది మోహము తొలగనే తొలగదు. బాబా అయితే అంటారు, పిల్లలను కూడా సంభాళించండి. వారికి కూడా శివబాబా స్మృతిని కలిగిస్తూ ఉండండి. ఎవరైతే మంచివారు ఉంటారో, వారు శివబాబాను స్మృతి చేస్తూ ఉంటారు. తండ్రి అర్థం చేయిస్తారు, గవర్నమెంట్ కూడా పవిత్రతను కోరుకుంటుంది. కావున వారికి అర్థం చేయించాలి, మేము భారత్ ను పవిత్రతలోకి తీసుకువచ్చేందుకు, పవిత్రత యొక్క ప్రతిజ్ఞను చేస్తున్నాము. మేము భారత్ ను స్వర్గముగా తప్పకుండా చేస్తాము. కన్యలు, మాత-పితలను కూడా ఉద్ధరించగలరు. తండ్రినైతే పేదల పెన్నిధి అని అంటారు. షావుకార్ల మొత్తం ధనము, సామగ్రి మట్టిలో కలిసిపోతుంది. షావుకార్ల కోసం చాలా శక్తి కావాలి ఎందుకంటే జాయింట్ స్టాక్ ఉంటాయి కదా. మరి తమ వస్తువులను ఎలా సరెండర్ చేయగలరు! తండ్రి పేదల పెన్నిధిగానే మహిమ చేయబడ్డారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లక్ష్యము-ఉద్దేశ్యమును బుద్ధిలో పెట్టుకొని పవిత్రంగా అయ్యేందుకు పూర్తి నష్టోమోహులుగా అవ్వాలి. పాత శరీరాల నుండి మమకారం తొలగించివేయాలి.

2. లేస్తూ-కూర్చుంటూ తండ్రి స్మృతిలో ఉండాలి. ఏ విషయము గురించి చింతించకూడదు. ఎప్పుడూ తండ్రిని నిందింపజేసే కర్మలేవీ చేయకూడదు.

వరదానము:- సదా స్నేహం మరియు సహయోగం ద్వారా అవినాశీ రత్నము అన్న బిరుదును ప్రాప్తి చేసుకునే అమర భవ

ఎవరైతే స్థాపనా కార్యములో సదా స్నేహీలుగా మరియు సహయోగులుగా ఉంటారో, వారికి అవినాశీ రత్నము అన్న బిరుదు లభిస్తుంది. ఇటువంటి అవినాశీ రత్నమును ఎవ్వరూ ఎప్పుడూ కదిలించలేరు. ఏ ఆటంకము ఆపలేదు. ఇటువంటి అవినాశీ రత్నాలే అమర భవ యొక్క వరదానులు. నిజమైన బంగారము వంటివారు, తండ్రికి సహచరులు. వారు తండ్రి కార్యాన్ని తమదిగా భావిస్తారు. సదా తోడుగా ఉంటారు, అందుకే అవినాశీగా అవుతారు.

స్లోగన్:- పవిత్రత యొక్క యథార్థ ధారణ ఉన్నట్లయితే ప్రతి కర్మ యథార్థముగా మరియు యుక్తియుక్తముగా ఉంటుంది.